# కోడలికి మరుగుదొడ్డి బహుమానంగా ఇచ్చిన అత్త

- **ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి అభినందనలు**

**ముప్పాళ్ల, న్యూస్‌టుడే:** ఆడబిడ్డ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కోడలికి మరుగుదొడ్డి బహుమానంగా ఇచ్చిన అత్త స్ఫూర్తిదాయక ఉదంతం గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలంలోని బొల్లవరంలో వెలుగుచూసింది. ఈ విషయం దిల్లీకి చెందిన రోస్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి వెళ్లింది. స్వచ్ఛభారత్ అమలుకు కేంద్రం నిర్వహిస్తున్న 'స్వచ్ఛభారత్ మిషన్- గ్రామీణ్'లో అత్తగారి స్ఫూర్తిపై మంగళవారం ప్రధాని ప్రశంసలు కురిపించినట్లు సమాచారం. బొల్లవరానికి చెందిన షేక్ షంషున్‌బేగం దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంట్లో మరుగుదొడ్డి లేకపోవడంతో 30 ఏళ్లనుంచి షంషున్‌బేగం, కుటుంబీకులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. మరుగుదొడ్డి కట్టుకోవాలంటే ఆర్థిక స్థోమత చాలలేదు. కాలక్రమంలో కుమారుడు షార్జహాన్‌కు నరసరావుపేట మండలం తురకపాలెం గ్రామానికి చెందిన యువతి సల్మాతో వివాహం నిశ్చయమైంది. తన ఇబ్బందులు తన కోడలికి రాకూడదని భావించి మరుగుదొడ్డినే బహుమతిగా ఇవ్వాలని షంషున్‌బేగం నిర్ణయించుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వచ్ఛత పిలుపు ఆమె చెవిన పడింది. సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించేందుకు సభాపతి కోడెల శివప్రసాదరావు చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమం గురించి ఆమె తెలుసుకుని మరుగుదొడ్డి నిర్మాణానికి ముందుకొచ్చారు. చెవిపోగులు తాకట్టుపెట్టి తొలుత మరుగుదొడ్డి పనులు ఆరంభించారు. నిర్మల్ భారత్ అభియాన్ కింద ఆమెకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.12 వేల ఆర్థికసాయం అందింది. దీనికి తన వ్యక్తిగత నగదు మరో రూ.4 వేలు జోడించి మరుగుదొడ్డిని నిర్మించారు. కాపురానికి వస్తూనే అత్త నుంచి మరుగుదొడ్డి రూపంలో విలువైన బహుమతిని కోడలు అందుకున్నారు. ఆమె స్ఫూర్తి ప్రస్థానాన్ని మండల అధికారులు దిల్లీకి చెందిన స్వచ్ఛంద సంస్థకు తెలిపారు.



కోడలు సల్మా



తాను నిర్మింపజేసిన మరుగుదొడ్డి ముందు అత్త షంషున్‌బేగం